ఆర్‌టిసికి రోజూ రూ.72 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-పీలేరు


మాట్లాడుతున్న రాము

అన్నమయ్య జిల్లాలో ఆర్టీసీకి రోజువారి ఆదాయం రూ.72 లక్షలు వస్తోందని జిల్లా ప్రజా రవాణాధికారి రాము తెలిపారు. మంగళవారం ఆయన పీలేరు ఆర్టీసీ గ్యారేజీ, బస్టాండు, డిపో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 478 బస్సు సర్వీసులు రోజుకు 1.85 లక్షల కిలో మీటర్లు తిరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మన జిల్లా ఆదాయంలో 16వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. కమర్షియల్‌గా మదనపల్లె-2 డిపో మొదటి స్థానంలో ఉందని చెప్పారు. పీలేరు నుండి నెల్లూరుకు నడుపుతున్న బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరిస్తామని చెప్పారు. బస్టాండులో ఎమ్మార్పీ రేట్లకే వస్తువులు విక్రయించాలని తెలిపారు. ఆర్టీసీ బస్టాండులోని మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం బండ్ల కుమార్, సీఐ ధనుంజయులు, ఎస్టీఐ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో నిబద్ధత, అంకితభావంతో లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ గిరీష పి.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డిఒలతో గృహ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, రీసర్వే, గ్రామ వార్డు సచివాలయ సేవలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు సంతృప్త స్థాయిలో అందించడమే ప్రభుత్వ ఆశయమన్నారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా పథకాలు అమలు పరచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు స్పందన సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మండలాల్లో అందిన అర్జీలను సరైన రీతిలో పరిష్కారం చూపుతున్నారా లేక ఎక్కువగా రీ ఓపెన్ అవుతున్నాయా అన్న అంశాలను ఆర్‌డిఒ స్వయంగా పరిశీలించాలన్నారు. ప్రతి పేదవాడికీ ఇల్లు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశమని చెప్పారు. మంజూరైన ప్రతి ఒక్కరూ సకాలంలో ఇంటిని పూర్తి చేసుకునేలా అధికారులు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. సొంత స్థలాలలో గృహ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు సంబంధించిన ఇకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సంక్షేమ కార్యదర్శులు, వాలంటీర్లు ఇకెవైసి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించిన నరేగా పనులను వందశాతం చేయాలన్నారు. నగరాల్లో కూలీలకు పని కల్పించడంలో 8 మండలాలు వెనుకబడి ఉన్నాయని, అక్కడ వెంటనే ప్రగతి సాధించేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. జగనన్న లేఅవుట్ కాలనీలలో మౌలిక వసతులను త్వరగా పూర్తిచేసేలా హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్తు, రెవెన్యూ, డ్వామా శాఖలు బాధ్యత వహించాలని, లక్ష్యసాధనలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. రీ సర్వేలో భాగంగా వెబ్ ల్యాండ్‌లో ఎల్‌పిఎం ఖాతాలకు ఫొటోలను ఎప్పటికప్పుడూ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వెబ్ ల్యాండ్ లో ప్రభుత్వ భూములకు ఫొటోస్ అప్లోడ్ చేయాలని వస్తోందని, క్షేత్రస్థాయిలో మరల పరిశీలన చేసి వాటిని సరి చేయాలని పేర్కొన్నారు.. ఏదైనా సమస్యతో అర్జీదారుడు వచ్చినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని, దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని గ్రాట్యూటీ ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పునిచ్చి ఏడాదూనా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సిద్దమ్మ, డి.భాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గ్రాట్యూటీ ఇవ్వాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షౌష్టికాహార లోపరహితంగా మార్చడానికి ప్రతి ఇంటికి నిర్విరామంగా అంగన్వాడీలు సుదీర్ఘంగా సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను గౌరవ వేతనం పొందే వారిలాగా చూస్తున్నారు తప్ప వర్కర్లుగా కార్మికులుగా గుర్తించలేని పేర్కొన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ ఇవ్వక మభ్యపెడుతున్నారని తెలిపారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న జిఒలు కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ పనిభారం పెంచుతున్నారని విమర్శించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఫయాజ్ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాలు రూ.26 వేలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిసికి అందజేశారు.

ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కార్యక్రమంలో అంగన్వాడీలు విజయమ్మ, ఉమా సుమలత, శంకరమ్మ, మంజుల, ఇందిరమ్మ, రమీజా, శోభ, పావని, బైరమ్మ, పార్వతి, సుబ్బమ్మ, రెడ్డెమ్మ, రాములమ్మ, యశోద, లక్ష్మిదేవి, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు ప్రమాదకరం

- సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరి సభలో నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలు దేశ సమైక్యతకే ప్రమాదమని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, రామానాయుడు అన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక శ్రామిక వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ ప్రచార భేరిలో భాగంగా మంగళవారం స్థానిక చిత్తూరు బస్టాండ్ వద్ద సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మురళి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించకపోతే దేశ సమగ్రతకు ఐఖ్యతకు ప్రమాదమని, దేశాన్ని కార్పొరేట్లకు పూర్తిగా అమ్మేస్తాడని పేర్కొన్నారు. మోడీకి మత పిచ్చి ముదిరిందని మతాల మధ్య చిచ్చు పెట్టి మంటలు కాస్తుందన్నారు. నవరత్నాలుగా చెప్పుకొంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు కార్పొరేట్ ప్రయోజనాలకోసం నల్ల చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. రైతాంగ చట్టాలకు వ్యతిరేకంగా రైతు సంఘాలు, కమ్యునిస్టు పార్టీ ఏడాది పాటు పోరాటం చేసి నల్ల చట్టాలను రద్దు చేసుకున్నామన్నారు. కమ్యూనిస్టులు ఈ దేశాన్ని మోడీ ఫాసిస్టు విధానాలను కాపాడు కొంటుందన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. కమ్యూనిస్టులు నాయకుల పదవులు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నేడు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. బిజెపి అధికారంలోకి రాక ముందు పెట్రోల్, డీజిల్ ధరలు రూ.50 లోపు ఉంటే ఈ రోజు రూ.వంద దాటిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు రాయలసీమకు ప్యాకేజీకి బిజెపి ఇవ్వకున్నా వైసిపి, టిడిపి అడిగే పరిస్థితి లేదన్నారు. జగన్ నవరత్నాల పేరుతో అప్పులు చేసి డబ్బులు పంచుతున్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులను నవరత్నాలకు మళ్లిస్తున్నారనారు. మదనపల్లి ప్రాంతంలో టమోటా రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజల స్వేచ్ఛను హక్కులను హరిస్తున్నారాని, దళితులపైన, దళిత ఉద్యోగులపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇండ్లను ఎందుకు పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, నరసింహులు, నాయకులు హరేంద్రనాథ్ శర్మ, వెంకటేష్, చంద్ర, మహేష్, కృష్ణప్ప, సాంబ శివ, తిరుమల, దేవా, ఓబులేసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

సభకు హాజరైన ప్రజలు, వామపక్షాల నాయకులు

'పర్యాటక హబ్‌గా హార్సిలీహిల్స్'

ప్రజాశక్తి-రాయచోటి

హార్సిలీహిల్స్‌ని పర్యాటక రంగ హబ్‌గా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, వెలిగల్లు జలాశయం దగ్గర ఏర్పాటు చేయనున్న సౌకర్యాలపై డిపిఆర్‌ని సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి చాలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో టెంపుల్ పర్యాటకం, ట్రెక్కింగ్ పర్యాటకం, యువ-పర్యాటకం, సాంస్కృతిక పర్యాటకం వంటి అనేక రకాల పర్యాటకాలను అభివృద్ధి చేసేందుకు అవకాశముందన్నారు. జిల్లాలో ట్రెక్కింగ్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, అటువంటి పర్యాటకానికి అవకాశమున్న హార్సిలీహిల్స్, వెలిగల్లు జలాశయాలను అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. వెలిగల్లు జలాశయం దగ్గర కాటేజేస్, హోటల్స్ వంటి వాటిని నిర్మించి అభివృద్ధి చేసేందుకు డిపిఆర్‌ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమశిల ప్రాజెక్ట్ దగ్గర కూడా పర్యాటక రంగానికి మంచి అవకాశముందని, పిపిపి మోడ్ ద్వారా అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో యువ-పర్యాటకాన్ని పెంపొందించేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను క్లబ్‌లుగా ఏర్పాటు చేసి వారిని పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్లాలని కలెక్టర్ జిల్లా విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. తదనంతరం జిల్లాలో చేపట్టబోయే పర్యాటక రిజిస్ట్రేషన్లు, మామిడి ఫెస్టివల్ వంటి పలు అంశాల మీద చర్చించారు. సమావేశానికి జిల్లా అటవీ అధికారి వివేక్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణ్ హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల

పేదల కడుపు కొడుతున్న ప్రభుత్వం :'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తూ ప్రభుత్వం పేదలు, ఉపాధి కూలీల కడుపు కొడుతోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం నీరుగారిపోతోందని పేర్కొన్నారు. లక్షల నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలిచిందన పథకానికి పనులు తగ్గించి 29.6 లక్షల జాబ్ కార్డులను తొలగించారని పేర్కొన్నారు. 77.9 లక్షల మంది కూలీలు ఉపాధి కోల్పోయారని తెలిపారు. 2022-23వ సంవత్సరంలో 7.9 శాతం జాబ్ కార్డులను తొలగించిన చరిత్ర వైసిపిదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఉపాధి హామీ పథకం పైన ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎక్కువ సంఖ్యలో పనులు కల్పించి ప్రజలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, పట్టణ అధ్య క్షులు దగ్గుబాటి వెంకటేశ్వర్లు నాయుడు, మైనార్టీ నాయకులు అబూబకర్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చునని బైపిసి డీన్ కృష్ణారెడ్డి, ఐఐటి డీన్స్ చక్రవర్తి, వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం నారాయణ విద్యా సంస్థలచే ఓ కల్యాణ మండపంలో నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ తీసుకునే సమయంలో అధ్యాపకులు చెప్పే అంశాలను చక్కగా నేర్చుకోవాలన్నారు. నీట్ పరీక్ష ఎంతో కష్టతరంగా ఉంటుందని, ఇందుకు ప్రతి సబ్జెక్టులో విద్యార్థులు మంచి పట్టు కలిగి ఉండాలన్నారు. నారాయణ ఆధ్వర్యంలో నీట్ పరీక్షకు అద్భుత శిక్షణను ఇవ్వడం జరుగుతోందన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులచే నాణ్యమైన బోధన జరుగుతోందన్నారు. గతంలో సంస్థ తరపున శిక్షణ పొందిన చాలా మంది విద్యార్థులు నీట్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించి డాక్టర్లుగా స్థిరపడ్డారన్నారు. డాక్టర్ కావాలనే కలను సహకారం చేసుకోవడానికి విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. పరీక్షకు సిద్ధమయ్యేటప్పుడు ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా స్వేఛగా పరీక్ష రాయాలన్నారు.మే 7న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు చక్కగా రాసి,మంచి ర్యాంకులు సాధించి డాక్టర్లుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను వారు నివృత్తి చేశారు. ఈ సదస్సుకు మదనపల్లి పరిసర ప్రాంత విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో డిజిఎం కొండలరావు, ప్రిన్సిపల్ తారకరామ నాయుడు, మదనపల్లె ఎజిఎం శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

అతిథులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ఐఎన్‌టిఎస్‌ఒ ఫలితాల్లో 'శ్రీచైతన్య' ప్రభంజనం

ప్రజాశక్తి-రాయచోటి

ఐఎన్‌టిఎస్‌ఒ ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అనూహ్య ఫలితాలు సాధించి వివిధ విభాగాల్లో ప్రతిభ చాటారని కడప డివిజన్ ఎజిఎం డి.రమణయ్య తెలిపారు. ఈ ఏడాది మార్చి 25 నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు 10వ తరగతి విద్యార్థులకు జరిగిన పరీక్షా ఫలితాల్లో కడప డివిజన్ రాయచోటి విద్యార్థులు తిరుగులేని విజయాలను సాధించి ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, మెడల్స్‌తో పాటు వివిధ రకాల ప్రైజులు సాధించిన విజేతలను ఆయన అభినందించారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ఆర్‌ఐపి మహబూబ్ బాషా పిల్లల తల్లిదండ్రులతో కలిసి విజేతలకు మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ ఇంతటి ఘనవిజయం సాధించ డానికి శ్రీ చైతన్య విద్యా సంస్థలు రూపొందించిన వివిధ అకాడమిక్ ప్రోగ్రామ్స్ మైక్రో లెవెల్ టీచింగ్ తోబాటు అంకితభావంతో పనిచేసే అధ్యాపకులు ముఖ్యకారమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.సుబ్బోజి, వైఎస్ ప్రిన్సిపల్ కె.జీవానందం, ఎఒ వెంకట్రాజు, డీన్ నాగనరేంద్ర, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి రెడ్డివరప్రసాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జి ప్రసన్నతోబాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్కుల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ చోట్ల పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాల పరిశీలన చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాలలో ఆహ్లాదకరమైన పార్కుల ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి ఆయన పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించి,పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలకు పార్కులు అందుబాటులోనికి తీసుకురావాలని ఆదేశించారన్నారు. మదనపల్లి రోడ్, సుద్దలవాండ్లపల్లె రోడ్, గున్నిగుంట్ల రోడ్‌లలో పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సర్వేయర్ రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి

ప్రజాశక్తి-రాయచోటి

శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను మంగళవారం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ చైర్మన్ దువ్వూరి నరసింహాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 788వ సంవత్సరంలో కేరళలో జన్మించి 12 సంవత్సరాలకే వేదాలు పట్టి అవపాసన పట్టి 16 సంవత్సరాలలోనే శాస్త్రాలలోనూ ఖ్యాతి గడించిన వారన్నారు. నేటి యువత ఆయన ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, ప్రధాన కార్యదర్శి మద్దిరేవల నటరాజ ఆచారి, ఉపాధ్యక్షులు చెన్నూరు రత్నమాచారి, ఆలయ సభ్యులు మరిపల్లె ఈశ్వర ఆచారి, నాగరాజ ఆచారి, శివారెడ్డి, వంగిమల్ల రవికుమార్, రామయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శంకరాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్ళబైలు పంచాయతీ బృందావన్ కాలనీ, బయారెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పించాలని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి తెలిపారు. మంగళవారం కాలనీ వాసులతో కలిసి ఎంపిడిఒ తాజ్ మాస్రూర్‌కు వినతిపత్రం అందించారు. కాలనీలు ఏర్పడిన నాటి నుండి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా గుర్తించామన్నారు. నీటి సమస్య, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఎంపిడిఒ తక్షణమే నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్, ఐటి విభాగం జగదీష్, రెడ్డెమ్మ,కుమార్, లక్ష్మీపతి కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం, ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి మూల్యాంకణ కేంద్రాన్ని సందర్శించారు. ముందుగా ఆయనకు డిఇఒ పురుషోత్తం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పూలబొకేలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం పదో తరగతి పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకణం చేస్తున్న సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి గదికీ ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ముల్యాంకన సిబ్బందికి రెమ్యునరేషన్ పెంచినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఉపాధ్యాయుల బదిలీలుంటాయని, డిఎలు కూడా విడుదల చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు, జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, డిసిఇబి కార్యదర్శి నాగముణిరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజల హృదయాల్లో నిలిచిన జగన్ : 'గడికోట'

రాయచోటి : బడుగు, బలహీన వర్గాల హృదయాలలో సిఎం జగన్ నిలిచారని వైఎస్ఆర్ సిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మి, మాజీ జెడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, గొర్ల రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, ఎంపిటిసి రామరాజు, లయన్ యర్రపురెడ్డి బ్రహ్మానంద రెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి , అనిరుధ్‌రెడ్డి, వాయల్పాటి ఆనంద కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, శివారెడ్డి, డిసి మాజీ డైరెక్టర్ బుల్లి వెంకట రమణ ప్రారంభించారు. గాండ్లపల్లె, కొండ్రువాండ్లపల్లె, బండకాడ మాలపల్లె, నరసారెడ్డి గారిపల్లె, ఒంటిల్లు బిడికి, వడ్డెపల్లె, బలిజపల్లె, కొత్తపల్లె బిడికి లలో శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటి పర్యటన చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వరి భాయి, ఎంపిడిఒ నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి, జెసిఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణా రెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, కిశోర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శివయ్య, రమణా రెడ్డి, శంకరయ్య నాయుడు, డీలర్ వెంకటేశ్వర నాయుడు, జనార్ధన నాయుడు, ఉమా మహేశ్వర నాయుడు, తిరుపాల్ నాయక్, ఆనంద్ రెడ్డి, మహేశ్వర, నాగరాజు, సర్పంచ్ దండు నాగభూషన్ రెడ్డి, అమరనాధరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె అర్బన్: యూత్ స్పోర్ట్స్ రిక్రియేషనల్ ట్రోఫీ టెన్నిస్ టోర్నమెంట్‌లో మదనపల్లికి చెందిన ఎంకెఎన్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారని టెన్నిస్ కోచ్ మణిగే భాస్కర్ నాయుడు తెలిపారు. సోమవారం తిరుపతి జోన్ పరిధిలో జరిగిన అండర్-10 నుండి 14 ఏళ్ల లోపు టెన్నిస్ పోటీలలో మదనపల్లె ఛాంపియన్స్ తిరుపతి జోన్లో అండర్-10లో జోషిత్ విజేతగా నిలిచాడు. సెమీఫైనలిస్ట్ జైదీప్, హనీష్, క్వార్టర్ ఫైనల్‌కు నిఖిలేష్, హషన్ చేరుకున్నారని తెలిపారు. గణేష్ ఫైనల్స్‌లో రన్నరప్‌గా నిలిచాడు. వీరందరిని టెన్నిస్ కోచ్ మణిగే భాస్కర్ నాయుడు, క్రీడాకారులు వారి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. వారికి సర్టిఫికేట్లు, మెడల్స్ అందజేశారు. విద్యతో పాటు క్రీడలలో ప్రతిభ ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. 15 రోజుల్లో కోటి కుటుంబాలను కలవడం రికార్డు అని, నియోజకవర్గంలో 49 వేల కుటుంబాలను కలిసామన్నారు. సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అవినీతికి తావులేకుండా పాలన సాగుతోందని చెప్పారు. 85 శాతం మంది ప్రజానీకం జగనన్నే మా భవిష్యత్ అంటున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, సీనియర్ నాయకులు ఎల్‌వి. మోహన్ రెడ్డి, తురక శ్రీనివాసులు రెడ్డి, రామనాథం, జనార్ధనరాజు, పట్టణకన్వీనర్ రమేష్, సిద్ధయ్య, బత్తల సుబ్రమణ్యం, శంకరయ్య, లింగం లక్ష్మీకర్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పట్టణంలో ముమ్మరంగా సాగుతోందని మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి రెడ్డి హరి పేర్కొన్నారు. మెగా సర్వే పట్టణంలోని ఒకటవ సచివాలయం పరిధిలో 75శాతం పూర్తయిందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఒ ఇంతియాజ్, సచివాలయ కన్వీనర్లు చాంద్‌బాషా, అంజమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, విద్యాకానుక ఒకేసారి ఇవ్వాలి

ప్రజాశక్తి-కలికిరి

పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక సామగ్రి ఒకేసారి పాఠశాలలకు చేరే విధంగా చూడాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ పేర్కొన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో నైనా పాఠ్యపుస్తకాలు అన్ని తరగతులుకూ ఒకేసారి ఇవ్వాలని, ప్రధానోపాధ్యాయులుకు ముందస్తు తేదీలు తెలిపి, ప్రతి తరగతికీ మొదటి సెమిస్టర్ పూర్తిగా ఒకేసారి అందించాలని తెలిపారు.

ప్రతిభచాటిన సాయి కళాశాల ఎంబిఎ విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ ఎంబిఎ విద్యార్థులు యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.ముబీనా 82 శాతంతో మొదటి ర్యాంకు, ఎస్.నజాఫ 81.5 శాతంతో రెండవ ర్యాంకు, కె.రుచిత 87 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, ఎంబిఎ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్, అధ్యాపకులు అభినందించారు.

గ్రామ స్వరాజ్యం సర్పంచులతోనే సాధ్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలికిరి

గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సర్పంచులతోనే సాధ్యమని ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. జాతీయ పంచాయతీ దినోత్సవ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఎంపిపి నూర్జహాన్, ఎంపిడిఒ గంగయ్య ఆధ్వర్యంలో ఉత్తమ గ్రామపంచాయతీలను ఎంపిక చేశారు. ఆరోగ్యకరమైన గ్రామపంచాయతీగా మహల్ మొదటి స్థానం, మేడుకుర్తి రెండవ స్థానం గుండ్లూరు మూడవ స్థానం, సామాజిక భద్రతలో మొదటి స్థానం చీకటిపల్లి, రెండవ స్థానం మొరంకిందపల్లి, మూడవ స్థానం పారపట్ల, పేదరికం లేని మెరుగైన జీవనోపాధిలో పతేగడ, మొదటిస్థానం, కలికిరి రెండవస్థానం, మరి కుంటపల్లి మూడవ స్థానాన్ని కైవసం చేసు కున్నాయి. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఆజాద్, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

అభివృద్ధికి అవకాశమివ్వండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు జనసేనకు ఒక అవకాశం ఇవ్వాలని జనసేన నాయకులు కోరారు. పవనన్న ప్రజాబాట 87వ రోజు కార్యక్రమంలో భాగంగా రాజంపేట జనసేన అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ ఆదేశాల మేరకు మంగళవారం ఆకేపాడు పంచాయతీలోని కట్టకింద పల్లె, నారం రాజు పల్లె, పెద్దూరు, అయ్యప్పరాజు గారి పల్లె, కమ్మపల్లె గ్రామాలలో పర్యటించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర వికాస కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు భాస్కర పంతులు, పోలిశెట్టి శ్రీనివాసులు, వీరయ్య ఆచారి, హేమంత్, జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

పని కావాలన్నా ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పని లభిస్తుందని ఎంపిడిఒ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. జోబీ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కలిగిస్తామని, ఉపాధి బిల్లులు కూడా ప్రతి వారం వారి ఖాతాలో జమ అవుతుందని అన్నారు. సీనియర్ మేట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. వేసవిలో కూలీలకు కూలి డబ్బు కూడా పెరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ములకలచెరువులో మంగళవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శంకరయాదవ్ ఆదేశాల మేరకు సూపర్వైజర్ గురువారెడ్డి, మండల కన్వీనర్ పాలగిరిసిద్ధ ఆధ్వర్యంలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల సమస్యలు , అక్రమ ఇసుక విధానం, విద్యుత్ చార్జీలు పెంపు వంటి అనేక సమస్యల గురించి ప్రజలకు వివరించి వారి వద్ద ఈ ప్రభుత్వ పనితీరు గురించి సమాచారం సేకరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధిక రేట్లను పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిన్న కృష్ణ, వెంకటస్వామి, శివన్న, కుల్లాయప్ప, రమణ మూర్తి, విజయ్, నారాయణ, గోట శివన్న, రెడ్డప్ప, శ్రీరాములు, బషీర్, సోము, ప్రతాప్, షామీర్, రాము, హరి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE : MADANAPALLE

O.S.No. 01 OF 2008

J.Venkatesh Babu & Others.
...Petitioners/Plaintiffs
Vs
Varapana L.Bhaskar Reddy & Others.
...Respondents/Defendants

D31- Proposed D31-S.K.Dasaratha Naidu, S/o not know to us, aged about 67 years, Hindu, Occ: Not Known to us.
Both now R/a D.No.14/122, West Kothapeta, Behind Town Bank, Madanapalle Town.

పై దావాలో ప్రతివాది D31-S.K.Dasaratha Naiduకు దావా సమన్లు పత్రికలో ప్రకటన మూలముగా జారీ చేయుటకు కోర్టు వారి అనుమతి తీసుకొని ఈ ప్రకటన ఇవ్వడమైనది. సదరు దావాలో మీకు ఏదైనా ఆక్షేపణ ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట నేరులో గాని వకీలు ద్వారా గాని లేక వివరములు తెలుపు మనిషి ద్వారా గాని 05.05.2023వ తేదీ ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరయి తెలుపుకొనవలయును. పై చెప్పబడిన దినము నందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు దావాను విమర్శచేసి పరోక్షముగా తీర్మానించబడును. పై చెప్పబడిన దినము నందు నీవు హాజరు కాకుండా తప్పిన యెడల నీ పరోక్షమందు దావాను విమర్శ చేసి పరోక్షముగా తీర్మానించబడును.

S.V.BHARATHWAZ
A.MANOHAR NAIDU,
M.N.NAGALAKSHMI KUMARI,
S.BANU,
Advocates, MADANAPALLE.

దోమల నివారణతో మలేరియాకు అడ్డుకట్ట : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్.కొండయ్య జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు లాంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలి మరణాలు కూడా సంభవిస్తాయని అన్నారు. దోమలు పెరగకుండా, దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ర్యాలీని స్థానిక ఏరియా హాస్పిటల్ నుంచి ప్రారంభమై నేతాజీ కూడలి మీదుగా బస్టాండ్ వరకు కొనసాగింది. అనంతరం బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి మలేరియా నియంత్రణకు ప్రతిజ్ఞ చేశారు.దోమ పుట్టకూడదు దోమ కుట్టకూడదు దోమతెరలు వాడండి, దోమకాటు నుండి రక్షణ పొందండి ,వేపాకు పొగ దోమలకు సెగ ,నిల్వ నీరు దోమలకు నిలయం లాంటి స్లోగన్లతో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, ఏరియా హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయచంద్ర, సిహెచ్‌ఒ నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, సూపర్వైజర్ వెంకటేశ్వర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కళందర్, టిబి సిబ్బంది నగేష్, ఉత్తమ్‌రెడ్డి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కలకడ : మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ కొండయ్య

వీరబల్లి : స్థానిక పిహెచ్‌సి డాక్టర్.వినయ్‌బాబు ఆధ్వర్యంలో పిహెచ్‌సి నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ మనీషా, ఆశ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, హెల్త్‌అసిస్టెంట్లు, సిహెచ్‌ఒ సుధాకర్, పిహెచ్‌ఎన్ గంగులమ్మ, హెల్త్ సూపర్వైజర్ సుబ్బయ్య, సరోజమ్మ హెల్త్‌అసిస్టెంట్ నాగయ్య పాల్గొన్నారు. **కలకడ:** కలకడ, ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎం.వి.కిషోర్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్, ఎంపిహెచ్‌ఇఒలు జయరామయ్య, వెంకటేశు, హెల్త్ ఎడ్యుకేటర్స్ మహమ్మద్ రఫీ, హెల్త్ సూపర్వైజర్లు వెంకటేశ్వరరావు, రామకృష్ణమ్మ, పిహెచ్‌ఎన్ సుబ్బరత్న, సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు :** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మండల వైద్యాధికారిని డాక్టర్ సృజన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సిహెచ్‌ఒ నారాయణ, సూపర్వైజర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** వైద్యాధికారులు డాక్టర్ రఫీఉల్లాఖాన్, డాక్టర్ సిద్దయ్య ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.రఫిల్లాఖాన్, ఎన్.సిద్దయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్, ఆరోగ్య అధికారులు దేవదానం, రవీంద్ర, సురేంద్రారెడ్డి, మని, వైద్య సిబ్బంది, సిహెచ్‌ఒ,ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సిఎం లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి-గుర్రంకొండ

మహిళా సాధికారతే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని దాదాపు 825 గ్రూపులకు రూ.7.85 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు ఈ సొమ్మును వారి వారి వ్యక్తిగత అకౌంట్ నందు వెలుగు సమాఖ్య జమ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన చాలా మంది మహిళా ప్రతి నిధులు హాజరు కాకపోవడం విశేషం. కార్య క్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర, మండల చైర్మన్ జై చంద్ర రెడ్డి, సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, వైసిపి మండల కన్వీనర్ ముక్తియార్, అలీఖాన్, మాజీ సర్పంచ్ అలీఖాన్, మాజీ ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లె పంచాయతీలలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రజలను పలకరించి వారి కుటుంబాలకి చేరిన సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. నడింపల్లి గ్రామానికి ఇప్పటికి రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడేవారిమనీ ఎమ్మెల్యే కృషితో నేడు గ్రామానికి తారు రోడ్డు వేయడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.వచ్చే ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఎంఇఒ త్యాగరాజు, సర్పంచ్ రెడ్డి నారాయణ, మహమ్మద్‌అలీ, సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ మల్‌రెడ్డి, వాటర్‌షెడ్‌దచీశీఅవగ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు సురేంద్ర, కరీముల్లా, శ్రీరాములు, రెడ్డిపరెడ్డి, వెంకట్రెడ్డి, అధికారులు, సచివాలయల కన్వీనర్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం కోసం కొలతలు తీస్తున్న సిబ్బంది

ఆధునిక పద్ధతుల్లో మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-నందలూరు

ఆధునిక పద్ధతులతో మరుగుదొడ్ల నిర్మాణం స్థానిక బస్టాండు నాలుగు రోడ్ల కూడలిలోని ఆర్‌ఎస్ రోడ్డులో చేపట్టనున్నట్లు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, కాంట్రాక్టర్ ఫల్గుణ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డిల సహకారంతో ఈ నిర్మాణాలను బుధవారం నుంచి మొదలు పెడదామని చెప్పారు. మహిళల, పురుషుల కోసం వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ డిఇ రవి కుమార్, ఇఒపిఆర్‌డి ఇన్‌ఛార్జి ప్రసాద్, ఇన్‌ఛార్జి పిఆర్‌ఎఇ నవీన్ కుమార్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని ఎద్దులవారిపల్లె ప్రాథమిక పాఠశాలను ఎఇఒ త్యాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులు హాజరు, రికార్డు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీచర్ సుగుణమ్మ పిల్లలకు నిర్వహించిన పరీక్షల తీరును సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సిఆర్‌పి బాలకృష్ణ ఉన్నారు.

ఎరువుల తయారీకి సిద్ధం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

చెత్త సంపద కేంద్రాల్లో ఎరువుల తయారీకి సిద్ధం చేయాలని మదనపల్లె డిఎల్‌పిఒ జయకుమారి అన్నారు. మంగళవారం పిటియం మండలంలోని మాడుమూరు డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి పంచాయతీకి ఆదాయం చేకూర్చేలా చూడాలన్నారు. చెత్త సంపద కేంద్రాలు స్థానిక సంస్థలకు ఆదాయ వనరులుగా తీర్చిదిద్దే భాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మనోహర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఇళ్ల నిర్మాణాలకు సెంట్రింగ్ యూనిట్లు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేందుకు మండలానికి రెండు చొప్పున సెంట్రింగ్ యూనిట్లు మంజూరు చేయాలని కలెక్టర్ గిరీష బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సెంట్రింగ్ యూనిట్ల మంజూరుపై బ్యాంకర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలానికి రెండు చొప్పున సెంట్రింగ్ యూనిట్లు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు సెంట్రింగ్ మెటీరియల్‌కు ఎక్కువ డబ్బులు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నాని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 16 సెంట్రింగ్ యూనిట్లు మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన 44 యూనిట్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎంతో మంది పేదలు సొంతిల్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇళ్ల నిర్మాణాలలో హౌసింగ్ రిలేటెడ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో ప్రతి పేదవారికి మంజూరైన ఇల్లు పూర్తిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ పి.వెంకటేశ్వర రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజా, హౌసింగ్ పీడీ శివయ్య, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

వైసిపితోనే గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-కాశినాయన

వైసిపితోనే గ్రామాభివృద్ధి జరుగుతుందని బద్వేల్ మార్కెట్ యార్డు డైరెక్టర్ కె.ఎల్. వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన నరసాపురం లోని మజీద్ నుంచి కల్లుబండ వద్దనున్న మెయిన్ రోడ్డు వరకు ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన సిసిరోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కు తుందని అన్నారు.గ్రామాల్లో మౌళిక వసతుల ఏర్పాటుకు ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రజలంతా వైసిపికి అండగా నిలుస్తున్నారని చెప్పారు.

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో తీవ్ర ఉష్ణోగ్రతలను లెక్కచేయకుండా పొట్టకూటి కోసం రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు అభయ ఫౌండేషన్ రీగ్ రెక్స్‌నోడ్ వారి ఆర్థిక సాయం మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. మంగళవారం వీటిని నెహ్రూ యుకేంద్ర అధికారి మణికంఠ చేతులమీదుగా అందించారు. చిరు వ్యాపారులకు గోడుగు ఎండవేడిమి నుంచి రక్షణ పొందేందుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. వ్యాపారులు ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేందుకు గొడుగులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమణ, నాగ మల్లారెడ్డి, ప్రేమానందం పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగులు అందిస్తున్న మణికంఠ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ పాండురంగ

చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషివిజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల విలువాదారిత ఉత్పత్తులు, పోషక విలువల ప్రాముఖ్యత అనే అంశం మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలికిరి చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త డాక్టర్ జిఎస్.పాండురంగ మాట్లాడుతూ చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. పోషక విలువల ప్రాముఖ్యత, ప్రస్తుత జీవనశైలి విధానంలో చిరుధాన్యాలను చేర్చుకోవలసిన అవసరం గురించి తెలిపారు. చిరుధాన్యాల వాడకం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను రాకుండా నివారించవచ్చని అన్నారు. చిరుధాన్యాల విలువాదారిత ఉత్పత్తుల తయారీ ద్వారా ఆర్థిక స్వావలంబన ఏర్పాటు చేసుకొనే విధానాల గురించి విద్యానంద్ అవగాహన కల్పించారు. కురబలకోట మండలం రైతులు చిరుధాన్యాలతో వివిధ విలువాదారిత ఉత్పత్తులు చిరుధాన్యాల పొంగలి మిక్స్, కిచిడిమిక్స్, మాల్ట్ తయారీ, లడ్డు వివిధ తినుబండారాలతో పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేయడం ద్వారా విజయవంతమైన స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ఐ.జ్యోతి, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పీలేరు

అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ మహిళ వైద్యం కోసం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని కావలిపల్లికి చెందిన కుళ్ళాయమ్మ గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతోందని తెలిసి, ఆమె శస్త్రచికిత్స కోసం రూ.75 అందించారు. దాత నుంచి వచ్చిన చెక్కును మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఎఎంసి మాజీ చైర్మన్ కడప గిరిధర్ రెడ్డి బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలు మహిత ఆనంద్, జిల్లా పర్యాటక, సంస్కృతికశాఖ డైరెక్టర్ షాకీర్, ఎఎంసి మాజీ డైరెక్టర్ ఎస్‌ఎల్ వి.సంజీవయ్య, కార్యకర్తలు ఆబిద్, మసూద్, ఉదయ్ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

సామాజిక తనిఖీపై అవగాహన

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఇఒ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులందరి భాగస్వామ్యంతో పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహించబడుతుందని అన్నారు. పాఠశాలల్లో మౌళిక వసతులు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, ఫర్నిచర్ త్రాగునీరు విద్యుత్ సౌకర్యము, పాఠశాల ఫైర్ సేఫ్టీ ,పాఠశాలలో నిర్వహించు వివిధ రకాల పరీక్షలు,నవరనాత్మక బోధన సహపాఠ్య కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, కవిత, రెడ్డెప్పరెడ్డి, కృష్ణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, బాబ్జాన్, సిఆర్‌పిలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఎంఇఒ రంగనాథయ్య, ప్రధానోపాధ్యాయులకు మాస్టర్ ట్రైనర్ నర్సారెడ్డి ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సామాజిక తనిఖీ శిక్షణ సమావేశం నిర్వహించారు. జరిగింది.ఎంఇఒ మాట్లాడుతూ తనిఖీలలో భాగంగా పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు పాఠశాల పర్యవేక్షణ గురించి, వాటి నమోదును యాప్‌లో నమోదు చేయడం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది, సిఆర్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బావిలో పడి బాలిక మృతి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రమాదవశాత్తుబావిలో పడి బాలిక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గరుగుపల్లి పూజలవాండ్లపల్లిలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల వివరాల మేరకు.. గరుగుపల్లి పూజల వాండ్లపల్లి కి చెందిన చింతంరెడ్డి ఇరగం రెడ్డి, చింతంరెడ్డి మమతలు తమ ఇద్దరి ఆడపిల్లలను ఈత నేర్పేందుకు బావి దగ్గరకు తీసుకెళ్లారని చెప్పారు. ఇద్దరి కుమార్తెలకు ఈత నేర్పిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పెద్ద కుమార్తె జాహ్నవి(7) నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

మృతి చెందిన బాలిక

తప్పిపోయిన యువతిని బంధువులకు అప్పగింత

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నందలూరు పంచాయతీ దిగువవీధికి చెందిన పత్తూరి పావని(19)ని బంధువులకు అప్పజెప్పినట్లు ఎఎస్ఐ జె.వి.సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కువైట్‌లో ఉండగా, పావని తన నాన్నమ్మ తో కలిసి ఉండేదన్నారు. పదవ తరగతి వరకు చదువుకొని ప్రస్తుతం ఇంటి వద్దనే ఉన్నట్లు తెలిపారు. గత మార్చి 14న ఆధార్‌కార్డు అప్డేట్ కోసం మీసేవకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదని పావని నానమ్మ పత్తూరి లక్ష్మీదేవి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పావనిని నానమ్మ పత్తూరి లక్ష్మీదేవికి అప్పచెప్పినట్లుఎఎస్ఐ తెలిపారు.

అగ్నికి మామిడి చెట్లు దగ్ధం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని మద్దిరేవుల గ్రామ పరిధిలోని శివమల్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి అనే రైతుల మామిడి తోట మంగళవారం అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ సందర్భంగా రైతులు శివమల్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డిలు మాట్లాడుతూ దాదాపు మామిడి తోట అంతా కోతకు వచ్చే సమయంలో ఎవరో గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పు పెట్టారని అన్నారు. మంటలు చెలరేగి దాదాపు బాగా కాపుతో ఉన్న 25 చెట్లు అగ్నికి కాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో మామిడి కాయలు కోసి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమయ్యామని దీంతో ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు తోటకు చుట్టూ ఉన్న కళ్ళకు నిప్పు పెట్టడంతో మొత్తం మామిడి తోట చుట్టూ ఉన్న కళ్ళ కాలిపోయి మామిడి కాయలు కూడా కాలిపోయాయని అన్నారు. నష్టాల్లో కూరుకపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు.



అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు